teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 383 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | సోమవారం | 27 మే 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## పాఠశాలల పని వేళల్లో మార్పులు

**ఉదయం 9గం. కు పాఠాశాలలు తెరచుకుని 4.45 వరకు**

**ఆమోదించినట్లు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ప్రకటన**

హైదరాబాద్, మే 26 (తీన్మార్ న్యూస్): వేసవి సెలవులు దాదాపు ముగిసే దశకు వచ్చేశాయి. రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 12న ప్రభుత్వ పాఠశాలలు తిరిగి తెరుచుకోనున్నాయి. ఈ క్రమంలోనే విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల సమయాల పని వేళల్లో మార్పులకు ఆమోదం తెలిపినట్లు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు. ఇది వరకు పాఠశాలలు

మిగతా 2 లో





### కొత్త ఎంపీలకు స్వాగతం పలికేందుకు సన్నాహాలు

**లోక్‌సభ సెక్రటేరియట్ విస్తృత ఏర్పాట్లు**

న్యూ ఢిల్లీ, మే 26 (తీన్మార్ న్యూస్): లోక్‌సభ ఎన్నికల ముగియడానికి మరియు ఫలితాల ప్రకటనకు మరికొన్ని రోజులు మిగిలి ఉన్నాయి. పార్లమెంటుకు కొత్తగా ఎన్నికైన ఎంపీలకు స్వాగతం పలికేందుకు సన్నాహాలు ముమ్మరంగా సాగుతున్నాయి. లోక్‌సభ సెక్రటేరియట్ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది మరియు ఇందుకోసం ప్రత్యేక అధికారుల బృందాలను ఏర్పాటు చేసింది. ఎన్నికల సంఘం

మిగతా 2 లో

### ఇంటర్నేషనల్ స్పూఫ్డ్ కాల్స్ బ్లాక్ చేయనున్న ప్రభుత్వం

**టెలికాం సర్వీస్ ప్రొవైడర్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీ**

న్యూ ఢిల్లీ, మే 26 (తీన్మార్ న్యూస్): ఇన్‌కమింగ్ ఇంటర్నేషనల్ స్పూఫ్డ్ కాల్‌లను బ్లాక్ చేయడం కోసం టెలికాం సర్వీస్ ప్రొవైడర్లకు (టిఎస్‌పి) ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. భారతీయ పౌరులకు భారతీయ మొబైల్ నంబర్‌లను

మిగతా 2 లో

# తుది అకం

## నేడే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక పోలింగ్



- ఎమ్మెల్సీ బరిలో మొత్తం 52 మంది అభ్యర్థులు
- మొత్తం ఓటర్ల సంఖ్య 4లక్షల 63వేల 839 మంది
- అభ్యర్థులకు అంకె ద్వారా ఓటరు ప్రాధాన్యత
- ఉదయం 8 గం.కు మొదలు సాయంత్రం 4 వరకు పోలింగ్
- పోలింగ్ ఏర్పాట్లను పూర్తి చేసిన అధికారులు
- ఉదయం 6 నుంచి రాత్రి 8 వరకు 144 సెక్షన్ అమలు







**తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక తుది అంకానికి చేరుకుంది. ప్రచారానికి గడువు ముగియడంతో ఇక అందరి దృష్టి పోలింగ్‌పై పడింది. మే 27వ తేదీన ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభం కానుంది. సాయంత్రం నాలుగింటికి ముగియనుంది. పోలింగ్ కోసం ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు.**

తెలంగాణ బ్యూరో, మే 26 (తీన్మార్ న్యూస్): జిల్లాల కేంద్రాల్లో బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ మెటీరియల్ పంపిణీ చేశారు. పోలింగ్ రోజు ఉదయం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు 144 సెక్షన్ అమలు చేయనున్నారు. 48 గంటలపాటు వైన్ షాపులు

మిగతా 2 లో



### పౌర సరఫరాల శాఖలో భారీ స్కాం

**35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పేరుతో 700 నుంచి 750 కోట్లు**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపనలు**

హైదరాబాద్, మే 26 (తీన్మార్ న్యూస్): పౌర సరఫరాల శాఖలో భారీ స్కాం జరిగిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. 35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పేరుతో 700 నుంచి 750 కోట్లు, మధ్యాహ్న భోజన పథకం కింద 2.20 లక్షల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం కొనుగోలు పేరిట మరో 300 కోట్లు. మొత్తంగా వెయ్యి కోట్ల కుంభకోణం చేశారని అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్ ఆదివారం మీడియాతో మాట్లాడుతూ స్కాం వివరాలను వెల్లడించారు. ఈ కుంభకోణం రెండు భాగాలుగా జరిగిందని

మిగతా 2 లో

### డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం మోపనున్న ప్రభుత్వం

**గుట్కా తయారీ, అమ్మకంను నిషేధిస్తూ ప్రభుత్వం నిర్ణయం**



హైదరాబాద్, మే 26 (తీన్మార్ న్యూస్): అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి అదికారంలో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటుంది. ముఖ్యంగా ప్రజల ఆరోగ్యం దృష్టి పెట్టి వచ్చి రాగానే

మిగతా 2 లో

### పార్టీ గుర్తు లేకుండానే ఎమ్మెల్సీ ఎన్నికలు

**అభ్యర్థి పేరు పక్కన బాక్స్ లో నంబర్ మాత్రమే వేయాలి**

**గత ఎన్నికల్లో 20వేలకు పైగా చెల్లని ఓట్లు**



తెలంగాణ బ్యూరో, మే 26 (తీన్మార్ న్యూస్): వరంగల్, ఖమ్మం, నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ కు అంతా సిద్ధమైంది. ఈరోజు ఉదయం 7 గంటల నుంచి ఓటింగ్ ప్రారంభం కానుంది. ఉప ఎన్నికల బరిలో 52 మంది అభ్యర్థులు

మిగతా 2 లో

### రైతుభరోసా వానాకాలంలోనే

**పంట వేసిన రైతులకే వర్తించనున్న సాయం**

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక ప్రకటన**



హైదరాబాద్, మే 26 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో రైతు పంటపెట్టుబడి సాయాన్ని పెంచుతామని కాంగ్రెస్ ఎన్నికల హామీల్లో పేర్కొంది. రైతుభరోసా కింద ఎకరానికి రూ.15వేలు ఇస్తామని చెప్పింది. ఇక ఆరుగ్యారెంటీల్లో దీన్ని కూడా చేర్చింది. ఇప్పటి వరకు గత ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధునే ఎకరానికి రూ.10వేలు జమ చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. అది కూడా 5 ఎకరాలలోపు ఉన్న రైతులకు ఈ పంటపెట్టుబడి సాయం అందించారు. మిగిలిన వారికి పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత జమ చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. కాగా పెంచిన

మిగతా 2 లో



### కేసీఆర్‌పై యుద్ధం చేస్తానని కత్తి తీసిన కాళ్ళదగ్గర పెట్టాడు

**ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ ఫైర్**

.. వివరాలు 2లో



### వేపచెట్టుకు కాసిన మామిడి పండ్లు

**అందరిని ఆశ్చర్యానికి గురిచేస్తున్న ప్రకృతి వింత**

**బ్రహ్మంగారి కాలజ్ఞానంలో ముందే చెప్పారని వాదనలు**

**స్వయంగా వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేసిన మంత్రి**

.. వివరాలు 2లో

### "జీవో 46 పై" బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య మాటల యుద్ధం

**ట్విట్టర్ వేదికగా ఆర్ఎస్ ప్రవీణ్ విమర్శలు**

**ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ కౌంటర్ ట్వీట్**

తెలంగాణ బ్యూరో, మే 26 (తీన్మార్ న్యూస్): గత ప్రభుత్వం నుంచి ఇప్పటి కొత్త ప్రభుత్వం వరకు జీవో 46 రద్దు చేయాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తూనే ఉన్నారు. ఈ క్రమంలోనే జీవో 46 పై బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. అధికారంలోకి వచ్చిన వెంటనే జీవో 46ను రద్దు చేస్తామన్న కాంగ్రెస్ నిరుద్యోగులకు మొండిచేయి చూపిందని ట్విట్టర్ వేదికగా బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పలు విమర్శలు చేశారు. దీనిపై ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ కౌంటర్ ట్వీట్ వేశారు. ఏమంటున్నారో

మిగతా 2 లో





### మార్పుకు అడ్డు వస్తే సహించేది లేదు

**బీఆర్ఎస్, బీజేపీ నేతలకు మంత్రి శ్రీధర్ బాబు మాస్ వార్నింగ్**

హైదరాబాద్, మే 26 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్, బీజేపీ రెండు పార్టీలు కలిసినా సీట్లు రావట్లేదనే అక్కసుతో అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ప్రతిపక్షాల విమర్శలకు ప్రభుత్వ పనితీరే సమాధానం చెబుతోందన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో కంటే తమ ప్రభుత్వం అభివృద్ధిలో మార్పు తెస్తుందని మార్పుకు అడ్డు వస్తే సహించేది లేదని వార్నింగ్ ఇచ్చారు. ఆదివారం గాంధీభవన్‌లో మంత్రి శ్రీధర్ బాబు మీడియాతో మాట్లాడుతూ.. అబద్దాలను ప్రచారం చేస్తే బీఆర్ఎస్ పార్టీ కనుమరుగు అవుతుందని చెప్పారు.వారిలో కూడా మార్పు తెచ్చే ప్రయత్నం చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వ పొరపాట్లను తాము ఏం చేయమన్నారు.గత ప్రభుత్వాన్ని సలహాలు, సూచనలు ఇవ్వమని చాలాసార్లు కోరామని.. వారు ఎలాంటి సలహాలు ఇవ్వలేదని చెప్పారు. తమ ప్రభుత్వం అత్యంత ప్రజాస్వామికంగా ఉందన్నారు. ప్రజలకు ఇస్తున్న పథకాలను కేసీఆర్, కేటీఆర్, హరీష్ పక్కతోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో ఎంజీఎం హాస్పిటల్లో గత ఏడాది121 సార్లు కరెంట్ బ్రేక్ డౌన్ అయిందన్నారు. ఎంజీఎం హాస్పిటల్లో ఎలుకలు పేషంట్ చర్మాన్ని తిన్నాయని గుర్తుచేశారు. గత ప్రభుత్వం సివిల్ సప్లయ్ శాఖలో అడ్డగోలుగా అప్పులు చేశారని మంత్రి శ్రీధర్ బాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



## డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం మోపనున్న ప్రభుత్వం

**మొదటి పేజీ తరువాయి**

ఆరోగ్యశ్రీ సేవల విలువను 10 లక్షలకు పెంచిన విషయం తెలిసిందే అలాగే యువతపై ప్రభావం చూపుతున్న డ్రగ్స్, గంజాయిపై ఇప్పటికే ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుంది. ఈ క్రమంలోనే తాజాగా తెలంగాణ రాష్ట్రంలో గుట్కా తయారీ, అమ్మకంను నిషేదిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన ఉత్తర్వులను ఫుడ్ సేఫ్టీ కమిషనర్ జారీ చేశారు. ఆ ఉత్తర్వులో ఆహార భద్రత, ప్రమాణాల చట్టం, 2006లోని సెక్షన్ 30 లోని సబ్-సెక్షన్ (2)లోని క్లాజ్ (%ఖ%) కింద అందించబడిన అధికారాలను అమలు చేయడంలో 2,3,4 ఆహార భద్రత, ప్రమాణాలు (అమ్మకాలపై నిషేధం, పరిమితి) రెగ్యులేషన్ 2011 ప్రజారోగ్య దృష్ట్యా, తెలంగాణ రాష్ట్ర ఆహార భద్రత కమిషనర్, పొగాకు,నికోటిన్‌లను పొగాకు/ పౌచ్‌లు/ ప్యాకేజీ/ కంటెయినర్లు మొదలైన వాటిలో ప్యాక్ చేసిన గుట్కా/పాన్‌మసాలా తయారీ, నిల్వ, పంపిణీ, రవాణా, విక్రయాలను నిషేధించిబడింది. ఈ నిషేధం 24 మే 2024 నుండి తెలంగాణ రాష్ట్రం మొత్తం అమలులో ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## కొత్త ఎంపీలకు స్వాగతం పలికేందుకు సన్నాహాలు

**మొదటి పేజీ తరువాయి**

ఎన్నికైన అభ్యర్థుల నోటిఫికేషన్‌ను విడుదల చేయగానే, కొత్తగా ఎన్నికైన ఎంపీల రాక ప్రారంభమవుతుందని మా ఆకాశవాణి ప్రతినిధి నివేదించారు. వారి ప్రయాణానికి ముందు, లోక్‌సభ సెక్రటేరియట్‌లోని నోడల్ అధికారులు వారితో సంప్రదింపులు జరుపుతారు. ఐజిఐ విమానాశ్రయం మరియు రైల్వే స్టేషన్లలోని వివిధ టెర్మినల్స్‌లో ప్రత్యేక రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. కొత్తగా ఎన్నికైన ఎంపీలు వాయు, రైలు, రోడ్డు మార్గాల ద్వారా వచ్చిన తర్వాత నిర్ణీత పాయింట్ల వద్ద స్వీకరిస్తారు. వారు పార్లమెంట్ అనెక్స్ ఎక్స్‌టెన్షన్ బిల్డింగ్‌లోని రిసెప్షన్ సెంటర్‌లకు చేరుకున్న తర్వాత, ఫోన్ కనెక్షన్‌లు, కొత్త బ్యాంక్ ఖాతాలు, పార్లమెంట్ భవనానికి స్మార్ట్ యాక్సెస్ కార్డ్‌లు, వారి వాహనాలకు ఫాస్టాగ్ స్టిక్కర్లు మరియు దౌత్య పాస్‌పోర్ట్‌లతో సహా అనేక పత్రాలు జారీ చేయబడతాయి. కొత్తగా ఎన్నికైన శాసనసభ్యులు నగరంలోని రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహాలు మరియు పశ్చిమ కోర్టు హాస్టల్ కాంప్లెక్స్‌లో బస చేస్తారు. కాబట్టి వారికి వసతి కూడా కేటాయించబడుతుంది. సభ్యులకు రాజ్యాంగం, నియమాలు మరియు విధానాలు మరియు వ్యాపార ప్రవర్తన మరియు చేతి పుస్తకంతో సహా ప్రచురణల సమితి కూడా ఇవ్వబడుతుంది.

## ఇంటర్నేషనల్ స్పూఫ్డ్ కాల్స్ బ్లాక్ చేయనున్న ప్రభుత్వం

**మొదటి పేజీ తరువాయి**

ప్రదర్శిస్తూ మోసగాళ్లు అంతర్జాతీయ స్పూఫ్డ్ కాల్‌లు చేస్తున్నారని మరియు సైబర్ నేరాలు మరియు ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారని కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కాల్‌లు భారతదేశంలోనే ఉద్భవించినట్లు కనిపిస్తున్నప్పటికీ, కాలింగ్ లైన్ గుర్తింపును మార్చడం ద్వారా విదేశాలకు చెందిన సైబర్-నేరస్థులు చేసినవి. నకిలీ డిజిటల్ అరెస్ట్‌లు, ఫెడ్ ఎక్స్ స్కామ్‌లు, కొరియర్‌లో డ్రగ్స్/నార్కోటిక్స్, ప్రభుత్వం మరియు పోలీసు అధికారులుగా నటించడం, డాట్‌లు/ట్రాయ్ అధికారులు మొబైల్ నంబర్‌లను డిస్‌కనెక్షన్ చేయడం మొదలైన కేసుల్లో ఈ కాల్స్ దుర్వినియోగం అయ్యాయని మంత్రిత్వ శాఖ తెలిపింది. టెలికమ్యూనికేషన్స్ డిపార్ట్‌మెంట్‌తో కలిసి, టిఎస్పి లు ఏ భారతీయ టెలికాం సబ్‌స్క్రైబర్‌కు చేరుకోకుండా ఇన్‌కమింగ్ అంతర్జాతీయ స్పూఫ్డ్ కాల్‌లను గుర్తించి నిరోధించడంలో సహాయపడే వ్యవస్థను రూపొందించినట్లు పేర్కొంది. డాట్ జారీ చేసిన ఆదేశాల ప్రకారం భారతీయ ల్యాండ్‌లైన్ నంబర్‌లతో వచ్చే అంతర్జాతీయ స్పూఫ్డ్ కాల్‌లు ఇప్పటికే టిఎస్పిల ద్వారా బ్లాక్ చేయబడుతున్నాయి. ఇప్పుడు అటువంటి ఇన్‌కమింగ్ అంతర్జాతీయ స్పూఫ్డ్ కాల్‌లను నిరోధించడానికి టిఎస్పి లకు ఆదేశాలు జారీ చేయబడ్డాయి, మంత్రిత్వ శాఖ తెలిపింది.

## పార్టీ గుర్తు లేకుండానే ఎమ్మెల్సీ ఎన్నికలు

**మొదటి పేజీ తరువాయి**

ఉండగా, 4,61,806 మంది గ్రాడ్యుయేట్లు ఓటు నమోదు చేసుకున్నారు. సాధారణ ఎన్నికలకు, ఎమ్మెల్సీ ఎలక్షన్లకు ఓటింగ్ విధానంలో తేడా ఉంటుంది. ఇతర ఎన్నికల తరహాలో ఈ ఎలక్షన్లలో పార్టీ సింబల్ ఉండదు. ఈవీఎంలు కాకుండా కేవలం బ్యాలెట్ పేపర్ మీదనే ఎలక్షన్ జరుగుతుంది. బ్యాలెట్ పేపర్ లో క్రమసంఖ్య, అభ్యర్థి పేరు, అభ్యర్థి ఫొటో మాత్రమే ఉంటాయి. దాని పక్కన ఉండే బాక్సులో అభ్యర్థికి ప్రాధాన్యతా క్రమంలో ఓటు వేయాల్సి ఉంటుంది. ఓటింగ్ సమయంలో చిన్న పొరపాటు చేసినా ఓటు చెల్లకుండా పోయే ప్రమాదం ఉంటుంది. 2021లో జరిగిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 20వేలకు పైగా చెల్లని ఓట్లు నమోదయ్యాయి. అభ్యర్థుల గెలుపోటముల్లో చెల్లని ఓట్లు కూడా కీలకంగా మారనున్నాయి.
చేయాల్సినవి. అభ్యర్థి పేరు, ఫొటో పక్కన ఉన్న బాక్సులో కేవలం ఇంగ్లీష్ నంబర్ మాత్రమే వేయాలి. ఒకటో ప్రాధాన్యత ఓటు వేయకుండా 2, 3 ఇతర ఏ నంబర్లు వేసినా ఆ ఓటు చెల్లుబాటు కాదు. పోలింగ్ బూత్‌లో అధికారులు ఇచ్చిన పెన్ తో మాత్రమే బ్యాలెట్ పేపర్ పై ప్రాధాన్యతా క్రమంలో ఓటు వేయాలి. సొంత పెన్ను వాడినా, ఇతర రంగులు పడినా ఓటు చెల్లదు. ఒక ప్రాధాన్యతను ఒకరికే వేయాల్సి ఉంటుంది. అంటే ఒకటో నంబర్ ను ఒకరికి మాత్రమే వేయాలి. ఆ తర్వాత రెండో నంబర్ ను ఒకరికి, మూడో నంబర్ ను మరొకరికి మాత్రమే వేయొచ్చు. బ్యాలెట్ పేపర్ పై అభ్యర్థి పేరు పక్కన కేవలం ఇంగ్లీష్ నంబర్ 1, 2, 3, 4, 5 అని మాత్రమే వేయాలి. ఒకటి అని తెలుగులో గానీ, వన్ అని ఇంగ్లీష్ లో గానీ రాయకూడదు.
ఇంగ్లీష్ నంబర్లలో కాకుండా, రోమన్ నంబర్లలో కూడా ప్రాధాన్యత ఓటు వేయొచ్చు. అయితే ఏదైనా ఒక విధానంలో మాత్రమే నంబర్లు వేయాలి. ప్రాధాన్యత క్రమంలోనే ఓటు వేయాలి. ఒకరికి ఒకటో ప్రాధాన్యత ఓటు వేసిన తర్వాత రెండో ప్రాధాన్యత వేయకుండా, మూడో ప్రాధాన్యత ఓటేస్తే అది చెల్లదు. అందుకని ఎంత మందికి ఓటేసినా ప్రాధాన్యత క్రమాన్ని చూసుకొని వేయాలి. బ్యాలెట్ పేపర్ పై నంబర్ తప్పించి టిక్ మార్క్ పెట్టినా, పేరు రాయడం గానీ, ఇతర ఏ గుర్తులు ఉన్నా వాటిని చెల్లని ఓటుగానే పరిగణిస్తారు. ఇద్దరు అభ్యర్థులకు మధ్యలో సంఖ్య వేసినా చెల్లదు. అభ్యర్థులు ఎంత మంది ఉంటే అందరికీ ఓటు వేయాల్సిన పనిలేదు. ప్రాధాన్యతక్రమంలో నచ్చిన కొందరికి ఓటేస్తే సరిపోతుంది. ఒక అభ్యర్థికి ఒక ప్రాధాన్యత ఓటు వేసిన తర్వాత దిద్దుబాట్లు గానీ, కొట్టివేయడం గానీ చేయకూడదు. ఏ విధమైన అంకె వేయకుండా ఇచ్చిన బ్యాలెట్ పేపర్ కూడా చెల్లుబాటు కాదు. ఎక్కువ ప్రాధాన్యతలు ఇవ్వడం ఇష్టం లేకపోతే కేవలం ఒకరు మాత్రమే ఆ పదవికి అర్హులు అనుకుంటే ఆ ఒక్కరికి మాత్రమే ఓటు వేసి మిగిలిన టూ, త్రీ ఇవ్వకుండా వదిలేయవచ్చు. ఒకే వ్యక్తికి రెండు ఓట్లు వేసినా చెల్లదు. ఒకటే నంబర్ ఇద్దరికి వేసినా చెల్లదు. ఓటు వేసిన తర్వాత బ్యాలెట్ పేపర్ ను బాక్స్ లో వేయకుండా తీసుకెళ్తే కేసు నమోదు చేస్తారు.
గత ఎమ్మెల్సీ ఎన్నికలో చెల్లని ఓట్లు ఎక్కువే
గతంలో జరిగిన గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పెద్ద సంఖ్యలోనే చెల్లని ఓట్లు నమోదయ్యాయి. డిగ్రీ పూర్తి చేసుకున్న వారు, టీచర్లు, ఇతర ఉద్యోగులుగా పనిచేస్తున్న వారే చెల్లని ఓట్లు వేస్తుండడంతో ఓటింగ్ ప్రక్రియపై వారికి అవగాహన లేదని అర్థమవుతోంది. 2021లో జరిగిన వరంగల్, ఖమ్మం, నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 20వేలకు పైగా చెల్లని ఓట్లు నమోదు కాగా, హైదరాబాద్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో 21 వేల ఓట్లు చెల్లకుండా పోయాయి. దీంతో అధికారులు కూడా ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. పోలింగ్ బూత్ లో కూడా ఓటే వేసే సమయంలో చేయాల్సినవి, చేయకూడని అంశాలతో పోస్టర్లను అంటించనున్నారు.

## రైతుభరోసా వానాకాలంలోనే

**మొదటి పేజీ తరువాయి**

పంటపెట్టుబడి సాయం ఎప్పటి నుంచి అందిస్తారా అని రైతులు ఎదురు చూస్తున్నారు. తాజాగా రైతుభరోసా రూ.15వేల సాయంపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక అప్‌డేట్ ఇచ్చారు. రానున్న వానాకాలం సీజన్ నుంచి రైతు భరోసా అమలు చేస్తామని చెప్పారు. పంట వేసుకున్న రైతులకే దీన్ని వర్తింపచేస్తామని ఆయన మరోసారి స్పష్టంగా చెప్పారు. జూన్‌లో ఎన్నికల కోడ్ ముగియగానే రైతుభరోసాపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. దీనికి రైతులు, రైతు సంఘాల నాయకులను ఆహ్వానించి అభిప్రాయాలు తీసుకుంటామని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. శాసనసభలో, మంత్రి మండలిలో చర్చించి పథకం అమలు చేస్తామని చెప్పారు. కౌలుదార్లు సాగు చేస్తే వారికే నిధులు ఇస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మరోవైపు గత ప్రభుత్వం రూ.లక్ష మాఫీయే సరిగ్గా అమలు చేయలేకపోయిందని మంత్రి తుమ్మల విమర్శలు చేశారు. ఇప్పుడు తాము రూ.2లక్షల రుణమాఫీని కచ్చితంగా అమలు చేస్తామన్నారు. ఒకే దఫాలో మొత్తం రుణమాఫీ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారనీ ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో రైతులు తీసుకున్న రూ.2లక్షల లోపు పంట రుణాలపై వాస్తవ గణాంకాలు ఇవ్వాలని బ్యాంకులకు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామని మంత్రి తుమ్మల చెప్పారు. అంతేకాదు అకాల వర్షాలు, వరదలతో పంట దెబ్బతిన్న రైతులను ఆదుకునేలా పంటబీమా పథకం ఉంటుందని మంత్రి తుమ్మల అన్నారు.

# తుది అంకం



**మొదటి పేజీ తరువాయి**

బంద్ చేశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం 52 మంది బరిలో ఉన్నారు. జంబో బ్యాలెట్ పేపర్‌తో పోలింగ్ నిర్వహించనున్నారు ఎన్నికల అధికారులు. మొత్తం 4లక్షల 63వేల 839 మంది ఓటర్లు ఉండగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలో లక్షా 73వేల 406మంది, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో లక్షా 23వేల 985, ఉమ్మడి నల్గొండ జిల్లాలో లక్షా 66వేల 448 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారు. 605 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వరంగల్, ఖమ్మం, నల్గొండ మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో 34 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. పోలింగ్ డే రోజు ఈ మూడు జిల్లాల్లో ప్రత్యేక సెలవు ప్రకటించారు. అధికారులు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద పోలింగ్ సామాగ్రి పంపిణీ చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. రేపు జరిగే పోలింగ్ కు అధికార యంత్రాంగం చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రచారం ముగించిన అభ్యర్థులు ఇక పట్టభద్రుల ఆశీస్సుల కోసం ఎదురు చూస్తున్నారు. విద్యావంతుల ఓటు ప్రాధాన్యత తెలుపడం ఎలాగో తెలుసా, అయితే సాధారణ ఎన్నికలతో పోల్చితే పట్టభద్రుల పోలింగ్ కాస్త భిన్నంగా ఉంటుంది.. 52 మంది అభ్యర్థులు బరిలో నిలిచిన నేపథ్యంలో జంబో బ్యాలెట్ ద్వారా పోలింగ్ నిర్వహిస్తున్నారు. ఓటర్లు అభ్యర్థులకు అంకె ద్వారా వారి ప్రాధాన్యత తెలపాల్సి ఉంటుంది. ఒకటోవ ప్రాధాన్యత, రెండోవ ప్రాధాన్యత ఇలా వారికి నచ్చిన అభ్యర్థికి ప్రాధాన్యత క్రమంలో ఓటు వేయాల్సి ఉంటుంది. ఓటు వేసే క్రమంలో ఇంటూ గుర్తు, ఇతర సింబల్స్ రాయకూడదు. మొదటి ప్రాధాన్యత అయితే అక్కడ ఒక నిలువు గీత మాత్రమే పెట్టి వారి ప్రాధాన్యత తెలపాలి. పోలింగ్ బూత్‌లో ఇచ్చిన పెన్ను మాత్రమే వాడాలి. కాదని ఎలాంటి ప్రయోగాలు చేసిన మీ ఓటు బురదలో వేసినట్లే అవుతుందంటున్నారు ఎన్నికల సంఘం అధికారులు. సోమవారం 27వ తేదీ ఉదయం 8గంటల నుండి సా.4 వరకు పోలింగ్ జరుగుతుంది. 48 గంటల పాటు మూడు జిల్లాల పరిధిలో మద్యం దుకాణాలు మూసి వేశారు. పోలింగ్ రోజు ఉ.6 నుండి సా.8 వరకు 144 సెక్షన్ అమలు చేస్తున్నారు.

# పౌర సరఫరాల శాఖలో భారీ స్కాం

**మొదటి పేజీ తరువాయి**

వివరించారు. ముందుగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సేకరించి మిల్లర్ల దగ్గర ఉంచిన 35 లక్షల మెట్రిక్ ధాన్యాన్ని విక్రయించేందుకు మూడు నెలల కింద రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో పౌరసరఫరాల శాఖ గ్లోబల్ టెండర్ల కహానీకి తెరలేపింది. అధికారంలోకి వచ్చి 50 రోజులు కాకముందే ఈ దోపిడీకి తెరలేపి జనవరి 25న కమిటీ వేసింది. అదే రోజు మార్గదర్శకాలు జారీ చేసి టెండర్లను పిలిచింది. ఇంకా విచిత్రమేంటంటే క్వింటాలుకు రూ.2100 కు కొనుగోలు చేయానికి రైస్ మిల్లర్లు సుముఖత వ్యక్తం చేసినప్పటికీ దాన్ని రిజెక్ట్ చేసి గ్లోబల్ టెండర్లు పిలిచారు. ప్రత్యేక నిబంధలు పెట్టి కేవలం నాలుగు కంపెనీలకే టెండర్లు వచ్చేటట్టు చేశారు. కేంద్రీయ బండార్, ఎల్జీ ఇండస్ట్రీస్, హిందూస్తాన్ కంపెనీ, నాక్‌హాఫ్ అనే నాలుగు సంస్థలు ఈ టెండర్లను దక్కించుకున్నాయి. గురుకులాల్లో కాంట్రాక్ట్ దక్కించుకున్న తర్వాత సరిగ్గా పనిచేయలేదని కేంద్రీయ బండార్ అనే సంస్థను 2023లో బీఆర్ఎస్ ప్రభుత్వం బ్లాక్ లిస్ట్ చేసింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కేంద్రీయ బండార్ సంస్థ కోసం రూల్స్‌ను రిలాక్స్ చేశారు. మిల్లర్లు క్వింటాలుకు 210 చెల్లించి కొనుగోలు చేస్తామని సుముఖత వ్యక్తం చేసినప్పటికీ ఆ నాలుగు కంపెనీలకే టెండర్లు కట్టబెట్టారు. క్వింటాలుకు దాదాపు 200 తగ్గించి 1885-2007 రూపాయలకు కొనుగోలు చేసేలా ఒప్పందం చేశారు. ఈ టెండర్ మార్గదర్శకాల ప్రకారం 90 రోజుల్లో 35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని లిఫ్ట్ చేసి ప్రభుత్వానికి రూ.7500 కోట్లు చెల్లించాలని నిబంధన పెట్టింది. టెండర్ గైడ్‌లైన్స్ ప్రకారం ఈ నాలుగు కంపెనీలు ధాన్యాన్ని లిఫ్ట్ చేయాలి. తప్ప ఏ లావాదేవీల్లో పాల్గొనవద్దు. కానీ వీళ్లు మిల్లర్లతో నేరుగా ఆర్థికపరమైన లావాదేవీలు చేస్తూ మనీలాండరింగ్‌కు పాల్పడ్డారు. గోదాముల్లోని ధాన్యాన్ని తీసుకుపోకుండా రైస్ మిల్లర్లపై బెదిరింపులకు పాల్పడ్డారు. టెండర్లు వేసింది 1885-2007 రూపాయలకు గానీ క్వింటాలుకు 2230 రూపాయలు చెల్లించాల్సిందే అని రాష్ట్రంలో ఉన్న నాలుగు వేల మంది రైస్ మిల్లర్లను కాంట్రాక్ట్ సంస్థలు బ్లాక్‌మెయిల్ చేస్తున్నాయి. క్వింటాలుకు రూ. 2007 కొనుగోలు చేయాలని కోట్ చేసినప్పటికీ మిల్లర్లు ఇంకో రూ.236 అదనంగా ఇవ్వాల్సిందేనని జలసౌధలో అనధికారికంగా ఒక ఒప్పందం కుదర్చుకున్నారు. సీఎం పేషీకి ఖర్చయ్యింది, ఢిల్లీకి పోవాలి ఎలక్షన్స్ ఉన్నాయి కాబట్టి క్వింటాలుకు 150 నుంచి 236 రూపాయలు అదనంగా చెల్లించి తీరాలని రైస్ మిల్లర్లను ఒత్తిడి చేశాయి. దీనికి సహకరించకపోతే విజిలెన్స్, జీఎస్టీ దాడులు జరుగుతాయని బెదిరిస్తున్నాయి. క్వింటాలుకు రూ.236 ఎక్కువగా ఇస్తే ధాన్యం లిఫ్ట్ చేయకపోయినా చేసినట్టు క్లియరెన్స్ ఇస్తామని బంపరాఫర్ కూడా ఇచ్చారు. అలా రైస్ మిల్లర్లపై పెద్ద ఎత్తున ఒత్తిడి తీసుకొచ్చి భారీ స్థాయిలో నగదు బదిలీ జరిగిందని సమాచారం అందింది. దాదాపు 35లక్షల మెట్రిక్ టన్నులకు 200 చొప్పున చూసుకున్నా 700 కోట్ల అదనపు డబ్బు మనీలాండరింగ్ ద్వారా మిల్లర్ల దగ్గర వసూలు చేస్తున్నారు. కాంట్రాక్ట్ పొందిన సంస్థలు కేవలం 90 రోజుల్లో ధాన్యం లిఫ్ట్ చేయాలి. చేయకపోతే ఏకారణంతో చేయలేదో చెప్పాలి 7,500 కోట్లు కట్టాలి. కానీ టెండర్ దక్కించుకున్న నాలుగు కంపెనీలు మాత్రం రైస్ మిల్లర్ల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నాయి. అసలు సంబంధంలేని ప్రైవేటు సంస్థలు ప్రభుత్వం తరపున డబ్బులు ఎలా వసూలు చేస్తాయి? 2100కు కొంటామని మిల్లర్లు కొంటామని సుముఖత వ్యక్తం చేసినా 1800-2007 కింద బ్యాండ్ ఫిక్స్ చేసి ఎలిజిబిలిటీ క్రిటిరియా కింద ఎందుకు చిన్న చిన్న సంస్థలను ఎందుకు ఎగరగొట్టారో సమాధానం చెప్పాలి. మిల్లర్లకు ఇచ్చిన 90 రోజుల గడువు అయిపోయింది. ఇప్పటికీ 20 శాతం కూడా లిఫ్ట్ చేయలేదు దీని వెనుక ఏం జరుగుతుంది. డెడ్‌లైన్ అయిపోయిన తర్వాత నిబంధనల ప్రకారం కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలి. కానీ తమకు రావాల్సిన 700 కోట్లు మొత్తం వాళ్ల చేతికి రాలేదు కాబట్టి ఈ డెడ్‌లైన్‌ను పెంచే ప్రయత్నం చేస్తున్నారు. మిల్లర్లను బెదిరించి ఇవాళ అదనంగా డబ్బులు వసూలు చేయాలని చూస్తున్నారు. మిల్లుల్లోని ధాన్యాన్ని లిఫ్ట్ చేస్తేనే స్థలం ఖాళీ అవుతుంది అప్పుడు ప్రభుత్వానికి డబ్బులు వస్తాయి. ఒకవేళ జరగకపోతే 150 కోట్ల వడ్డీని అదనంగా చెల్లించాల్సిన పరిస్థితి పౌరసరఫరాల శాఖకు వస్తుంది. అని కేటీఆర్ తెలిపారు. ఇప్పటివరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారు. ఎంత లిఫ్ట్ చేశారో శ్వేతపత్రం ప్రచురించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ బ్లాక్ లిస్ట్‌లో పెట్టిన కేంద్రీయ బండార్‌పై వెంటనే బ్లాక్‌లిస్ట్ నుంచి తీసేసి టెండర్‌లో పాల్గొనేందుకు అనుమతించారో ప్రజలకు వివరంగా చెప్పాలన్నారు. ఇందులో వందల కోట్లు ముట్టిన మాట వాస్తవమో కాదో ఎంక్వైరీ ద్వారా తేల్చాలన్నారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలనే ఉద్దేశంతో సన్న బియ్యం అందించే స్కీమ్ తీసుకొచ్చామని కేటీఆర్ తెలిపారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అందులో కూడా స్కామ్ చేశారని చెప్పారు. మధ్యాహ్న భోజన పథకానికి 2.20 లక్షల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం కావాలి. దీనికోసం పౌరసరఫరాల శాఖ గ్లోబల్ టెండర్ పిలిచింది. ఇందులో కూడా అవే నాలుగు కంపెనీలు పాల్గొన్నాయి. బహిరంగ మార్కెట్‌లో సన్న బియ్యం ధర 42-45 రూపాయలు ఉంది. కానీ బహిరంగ మార్కెట్, మిల్లర్లను పక్కనబెట్టి టెండర్ల పిలిచారు. కిలోకు 15 రూపాయలు అదనంగా అంటే 57 రూపాయలతో టెండర్ ఖరారు చేశారు. 2.20 లక్షల మెట్రిక్ టన్నులకు 15 రూపాయలు అదనంగా అంటే 300 కోట్ల స్కామ్ జరిగింది. మొత్తంగా వెయ్యి, 1100 కోట్ల స్కామ్ జరిగింది. అని కేటీఆర్ వివరించారు. ప్రతి సంవత్సరం రాష్ట్రంలోని రైతుల నుంచి పౌరసరఫరాల శాఖ కొని ఎఫ్‌సీఐకి అమ్ముతుంది. రైతుల నుంచి దొడ్డు, సన్న రకాల వడ్లు కొంటాం. మా ప్రభుత్వం హయాంలో కొనుగోలు చేసిన దాంట్లో 1.6 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం ఉంది. దాన్ని మిల్లింగ్ చేసి స్కూల్ డిపార్ట్‌మెంట్‌కు ఇస్తే కేవలం 60 వేల టన్నులు కొనాల్సి వచ్చేది. కానీ 1.6 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం ఉన్నప్పటికీ దాన్ని రూ.22.59 పైసలకు అమ్మేశారు. అలా కాకుండా ఈ ధాన్యాన్ని మిల్లర్లకు ఇచ్చి సన్న బియ్యం తీసుకోవచ్చు. తద్వారా లక్ష టన్నుల సన్న బియ్యం కేవలం రూ.35కే వచ్చేది. ఈ లక్ష టన్నులు పోనూ మిగిలిన దానికి టెండర్లు పిలుచుకోవాల్సింది. కానీ ఆ ధాన్యాన్ని అమ్మి సన్న బియ్యాన్ని ఎక్కువ ధరకు కొనుగోలు చేశారు అని తెలిపారు.

## పాఠశాలల పని వేళల్లో మార్పులు

**మొదటి పేజీ తరువాయి**

ఉదయం 9.30కి తెరుచుకుని 4.30కి మూతపడేవి. కానీ, తాజా నిర్ణయం ప్రకారం ఉదయం 9 గంటలకే పాఠాశాలలు తెరచుకుని 4.45 వరకు మూతపడనున్నాయి. విద్యార్థులు ఉదయం 9.30 కి స్కూలుకు వెళ్లడం వల్ల ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు చులకన భావం ఏర్పడుతోందనే విషయం విద్యాశాఖ అధికారుల దృష్టికి వచ్చింది. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వం పాఠశాలలను నడపాలని అధికారులు విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంకు వివరించారు. ఈ క్రమంలోనే ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను 2024 - 2025 విద్యా సంవత్సరం నుంచి ఉదయం 9.00 గంటలకే ప్రారంభించాలనే ప్రతిపాదనకు ఆయన ఆమోదం కూడా తెలిపారు.

## కేసీఆర్‌పై యుద్ధం చేస్తానని కత్తి తీసిన కాళ్ళదగ్గర పెట్టాడు

తెలంగాణ బ్యూరో, మే 26 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ ఫైర్ అయ్యారు. గాంధీ భవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీఎస్పీలో ఉన్నప్పుడు కేసీఆర్‌పై యుద్ధం చేస్తానని కత్తి తీసిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఇప్పుడు కత్తి దాచిపెట్టి బీఆర్ఎస్‌లో చేరి ఆత్మగౌరవాన్ని కేసీఆర్ కాళ్ళ దగ్గర పెట్టాడని ఎద్దేవా చేశారు. ఇక, గుండాగిరికి కేరాఫ్ అడ్రస్ అని గూగుల్‌లో కొడితే గువ్వల బాలరాజు అని వస్తుందని సెటైర్ వేశారు. అక్రమ కేసులు పెట్టించడంలో ఆయనకు ఆయనే దిట్ట అని అన్నారు. గతపాలనలో పోలీస్ డిపార్ట్మెంట్‌లో కమాండింగ్ చైన్ తెగిపోయిందని, ఎమ్మెల్యే ఏం చెప్తే సీఐ, ఎస్ఐలు అదే చేశారని అసహనం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులు పెట్టిస్తోందన్న తప్పుడు ఆరోపణలు చేస్తోన్న ఆర్ఎస్పీ ప్రవీణ్ కుమార్ గత బీఆర్ఎస్ ప్రభుత్వం పెట్టిన ఫేక్ కేసులు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మర్చిపోయి ఉంటాడని.. గతంలో బాలరాజు నిన్నుకూడా బెదిరించాడని గుర్తు చేశారు. నయిమ్‌తో సంబంధాలు ఉన్నది మాకు కాదని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజుకేనని అన్నారు. త్వరలోనే గువ్వల బాలరాజు చిట్టా అంతా విప్పుతామని కీలక వ్యాఖ్యలు చేశారు. నయిమ్ డైరీ బయట పెట్టాలని సీఎంని కోరుతానని, దీనిపై అసెంబ్లీలో కూడా మాట్లాడతానని వంశీకృష్ణ స్పష్టం చేశారు. నయిమ్ అక్రమంగా సంపాదించిన ఆస్తులు ఎక్కడ పోయాయి. వాటి అన్నింటిపై విచారణ జరపాలని డిమాండ్ చేస్తానన్నారు. నయిమ్ ఆస్తులు కేసీఆర్, కేటీఆర్‌కి ఎంత ఎంత వెళ్లాయి అనేది తేలాలని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

## "జీవో 46 పై" బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య మాటల యుద్ధం

**మొదటి పేజీ తరువాయి**

మీకూ అయినా అర్థం అవుతుందా సార్! జనాలు చూస్తే నవ్వి పోతారు. జీవో 46 తెచ్చింది ఎవరు, దాని పైనాపిల్ వేసేది ఎవరూ చరిత్ర మరిచారేమో ఈ జీవో తెచ్చింది, నిరుద్యోగుల పైన రుద్దిందే మీ దొర ఆధ్వర్యంలోని పాత ప్రభుత్వం. మీరే జీవోలు ఇచ్చి, మీరే పిల్‌లు వేసి లబోదిబోమనడం తగునా! ఆ జీవో ఇచ్చినపుడు మీరందరూ తాగున్నారా లేక ఇప్పుడు ఓటమి జీర్ణించుకోలేక తాగి ఇలా చేస్తున్నారా అని నిలదీశారు. మీరు ఎన్ని స్టంట్స్ వేసినా విద్యార్థులు, నిరుద్యోగులు మిమ్మల్ని మళ్ళీ నమ్మరు. ఎమ్ఎల్సీ ఎన్నికల్లో గ్రాడ్యుయేట్‌లు మిమ్మల్ని బొంద పెట్టడం ఖాయం అని విమర్శించారు. ఈ ప్రజా ప్రభుత్వం తరపున విద్యార్థి నిరుద్యోగులకు నాది హామీ జీవో 46 సమస్య పరిష్కారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసిన విషయం విదితమే. త్వరలోనే ఈ కమిటీ ద్వారా చట్టాలకు లోబడి, మీకు న్యాయం జరగబోతుంది.. అని హామీ ఇచ్చారు.

## వేపచెట్టుకు కాసిన మామిడి పండ్లువేపచెట్టుకు కాసిన మామిడి పండ్లు

**మొదటి పేజీ తరువాయి**



తీన్మార్ వెబ్ డెస్క్, మే 26 (తీన్మార్ న్యూస్): మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్ నగరంలో చోటు చేసుకున్న ఓ ప్రకృతి వింత ఇప్పుడు అందరిని ఆశ్చర్యపరుస్తుంది. మధ్యప్రదేశ్ రాష్ట్ర పంచాయతీ గ్రామీణ అభివృద్ధి కార్మిక శాఖ మంత్రి అధికార నివాస ప్రాంగణంలో ఉన్న ఓ వేపచెట్టుకు మామిడి పండ్లు వేలాడుతూ కనిపించడం ఇప్పుడు అందరిని ఆశ్చర్య వ్యక్తం చేస్తుంది. ఇటీవల కాలంలో సోషల్ మీడియా అభివృద్ధి చెందినప్పటి నుంచి ఎక్కడ ఏం జరిగినా నిమిషాల్లో ప్రపంచమంతా తెలిసిపోతుంది. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా చాలా మంది స్మార్ట్ ఫోన్ వాడుతూ ప్రతి విషయాన్ని అందరికీ తెలిసేలా నెట్టింట షేర్ చేస్తున్నారు. కలియుగంలో చాలా వింతలు జరుగుతున్నాయి అందుకే విపత్తులు వస్తున్నాయని చాలా మంది నమ్ముతున్నారు. ఇదంతా బ్రహ్మంగారు కాలజ్ఞానంలో ముందే చెప్పారు అని వాదించేవారు చాలా మంది ఉన్నారు. తాజాగా మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో ఓ వింత చోటుచేసుకుంది. వేప చెట్టుకు మామిడికాయలు కాస్తున్నాయి. గుత్తులు గుత్తులుగా వేలాడిన మామిడి కాయలను చూడడానికి ప్రజలు ఎగబడ్డారు. అసలు విషయంలోకి వెళితే భోపాల్ రాష్ట్ర పంచాయతీ గ్రామీణాభివృద్ధి, కార్మిక శాఖ మంత్రి ప్రహ్లాద్ సింగ్ పటేల్ అధికారిక నివాసం సమీపంలో ఓ వేప చెట్టు ఉంది. దానికి మామిడికాయలు కాయడం మంత్రి గమనించారు. దాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దాంతో ఈ పోస్ట్ ఇప్పుడు తెగ వైరల్‌గా మారింది. పంచాయతీ గ్రామీణాభివృద్ధి, కార్మిక శాఖ మంత్రి ప్రహ్లాద్ సింగ్ పటేల్ అధికారిక నివాసంలో వేప చెట్టుకు గుత్తులుగా మామిడి కాయలు కాశాయి. మంత్రి స్వయంగా వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. మంత్రి తన ఇంటి ఆవరణలోని వేప చెట్టును దగ్గరకెళ్లి చూసి ఆశ్చర్యపోయినట్లు%ఔ% వేపచెట్టుకు మామిడికాయలు చూసి తన మనసు పులకరించిపోయింది అని రాసుకొచ్చారు. అంతే కాకుండా ఎంతో ప్రతిభ గల తోటమాలి ఈ ప్రయోగం చేసి ఉంటాడని, నిజంగా ఇది గొప్ప అద్భుతం అని పోస్టు చేశాడు. అంతే కాదు మంత్రి ప్రహ్లాద్ పటేల్ ఈ సమాచారాన్ని వ్యవసాయ శాస్త్రవేత్తలకు తెలయజేశారు. అధికారులు ఆ చెట్టును పరిశీలించారు. వేపచెట్టుకు సుమారు 20 నుంచి 25 ఏళ్లు ఉంటాయని, వేప కొమ్మలో మామిడి కొమ్మ కూడా ఉందని చెప్పారు. అయితే వేపకొమ్మపై మామిడి పూత పడడం వలన ఇలాంటి సంఘటనలు జరుగుతుంటాయని ప్రతిభా సింగ్ లో వృక్షశాస్త్రజ్ఞుడు చెప్పారు. ప్రస్తుతం ఈ సంఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది.

## కరీంనగర్ హెూటల్లో ఫుడ్ సెక్యూరిటీ అధికారుల తనిఖీలు

**పరిశుభ్రత, నాణ్యతలేని పలు హెూటళ్లపై కేసు నమోదు**





కరీంనగర్, మే 26 (తీన్మార్ న్యూస్): కరీంనగర్ జిల్లా కేంద్రంలోని హెూటల్లో ఫుడ్ సెక్యూరిటీ అధికారుల ఆదివారం తనిఖీలు నిర్వహించారు. పరిశుభ్రత పాటించకుండా, నాణ్యతలేని ఆహారపదార్థాలు విక్రయిస్తున్న పలు హెూటళ్లపై కేసు నమోదు చేశారు. కరీంనగర్ టౌన్ లోని శ్వేతా హెూటల్ తనిఖీల్లో కాలం చెల్లిన వస్తువులు ఫుడ్ సేఫ్టీ అధికారుల గుర్తించారు. స్టోర్ రూమ్ లో కాలం చెల్లిన జీడిపప్పు, ఆయిల్ మసాలాలు లభ్యమైయ్యాయి. నాసిరకం ఐస్ క్రీమ్స్, ఎక్స్ పెయిరీ డేట్ ముగిసిన చాక్లెట్ సిరప్స్ ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శాంపుల్స్ తీసుకొని ల్యాబ్ కు పంపించారు.

# బస్సు ఆపలేదని భార్యకోసం భర్త హంగామా

- వెంబడించి మరీ కండక్టర్‌తో గొడవకు దిగిన ఘటన వెలుగులోకి
- చిల్లర చేష్టలతో ఆర్టీసీ సిబందికి చుక్కలు
- బస్సుకు అడ్డంగా నిలబడి నానా హంగామా



హైదరాబాద్, మే 26 (తీన్మార్ న్యూస్): ఆర్టీసీ బస్సు ఆపలేదని ఏకంగా ఓ జంట కండక్టర్‌తో గొడవకు దిగారు. ఇలాంటి చోద్యం ఎక్కడా చూడలేదంటూ స్థానికులు, విషయం తెలిసిన వారు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇది జరిగింది మరెక్కడో కాదు. హైదరాబాద్ నగరంలోనే ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. తెలంగాణ ప్రభుత్వం ప్రజా సంక్షేమం నిమిత్తం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కలిపించడంతో ఇలాంటి సంఘటనలు చాలానే చూస్తున్నాం. ఆ మధ్య కొందరు మహిళలు ప్రయాణం ఉచితం కదా అని మగవాళ్లకు కూడా సీట్లు ఇవ్వకుండా మొత్తం వాళ్లే ఆక్రమించుకున్న సంఘటనలు చూశాం. ఆపై బస్సులో సీట్ల కోసం జుట్టు జుట్టు పట్టుకుని పొట్టు పొట్టున కొట్టుకున్న సంఘటనలు కూడా చాలానే ఉన్నాయి. అయితే ఇప్పుడు మరో సంఘటన వెలుగులోకి వచ్చింది. బస్సు ఆపలేదని వెంబడించి మరీ కండక్టర్‌తో గొడవకు దిగిన ఘటన చంద్రయాణగుట్ట చౌరస్తాలో చోటు చేసుకుంది. ఇలాంటి చిల్లర చేష్టలతో ఆర్టీసీ సిబందికి చుక్కలు చూపిస్తున్నారు ప్రజలు. హైదరాబాద్ ఎల్‌బీ నగర్ బస్ స్టాప్‌లో బస్సు కోసం ఓ మహిళ ఎదురుచూస్తోంది. ఇంతలో ఓ బస్సు వచ్చిందని, కానీ ఆ స్టాప్‌లో ఆపకుండా వెళ్లిపోయారని సదరు మహిళ ఆరోపిస్తుంది. దీంతో బస్సును వెంబడించి మరీ కండక్టర్‌పై దాడికి ప్రయత్నించారు. నడిరోడ్డుపై బస్సుకు అడ్డంగా నిలబడి వెళ్లనివ్వకుండా నానా హంగామా చేశారు. ఇలా ఎలా ఆపకుండా వెళ్తారని ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీనిపై ఆ బస్సు కండక్టర్ కూడా మాట్లాడుతూ.. రోడ్డుపై ట్రాఫిక్ ఎక్కువగా ఉండడం వల్లే ఇలా జరిగిందని అన్నాడు. ఇంతలో ప్రయాణికులు బస్సును ఆపలేదంటూ తమపై దాడికి దిగారని వాపోయాడు. దీంతో స్థానికంగా విధుల్లో ఉన్న ట్రాఫిక్ పోలీసులు కలగజేసుకుని గొడవ సద్దుమణిగేలా చేశారు. కాగా, ఈ ఘటనకు సంబంధించి బస్సు కండక్టర్, ప్రయాణికులు ఒకరిపై ఒకరు చంద్రాయణగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. ఇదిలా ఉండగా వాస్తవానికి హైదరాబాద్ నగరంలో చాలా చోట్ల బస్ స్టాప్‌లల్లో సిటీ బస్సులు ఆపడం లేదని పలువురు ప్రయాణికులు ఆర్టీసీ వ్యవస్థపై మండిపడుతున్నారు.